


# ప్రలోభం

" రాజాధిరాజ ! మహారాజా ! ఈ సేవకుడి విన్నపం తిలకించండి." వియనంగా చేతులు కట్టుకుని నిల్చున్నాడు చిత్రగుప్తుడు.

యమధర్మరాజు మొహంలో కళవళికలు మారుతున్నాయి. చిత్రగుప్తుడు యిచ్చిన విన్నపం చదువుతున్న కొద్దీ. ఆయన మొహం గమనిస్తూ, గుటకలు మింగుతున్నాడు గుప్తుడు చిత్రవిచిత్రంగా.

" మూర్ఖా ! ఏమిటి?"

" ప్రభూ ! మన్నించాలి !"

" అదే ఏమిటని ప్రశ్నిస్తున్నాము - "

" దానిలో తేటతెల్లంగా నా పరిస్థితి రాశాను - "

" చిత్రగుప్తా ! నీ లేఖ గుప్తంగా - చిత్రంగా ఉందయ్యా ! నోటితో చెబితే నీ నోటి ముత్యాలు రాలిపోతాయా ?"

" దొరవారు మన్నించాలి. రోజురోజుకు నా విధి నిర్వహణ మిగుల కష్టమై పోతున్నది. యుగయుగాలుగా కోట్ల సంవత్సరముల నుండి నేను మీ కనుసన్నలలో పని చేయుచున్నాను - కాని ఈ మధ్య నా అంతరాత్మ నాకు అడ్డు తగులుచున్నది. పాపులను శిక్షించుచునప్పుడు వారి భావములను నేను బాగుగా అర్థము చేసుకున్నానా లేదా అని సందేహము పీడిస్తున్నది." చిన్నగా చెప్పాడు చిత్రగుప్తుడు.

" ఏల సందేహమేల?"

" ఈ పాపులు మాట్లాడు భాష నాకు సరిగా అవగాహన అగుట లేదు. వచ్చేది - నివసించేది మన పరిధిలోని వాళ్ళే కాని - వారు మాటాడు భాష బహు విచిత్రముగా ఉంటున్నది - " తల బాదుకున్నాడు చిత్రగుప్తుడు.

" వృద్ధుడివైనావని నీకు అనేకమంది సహోద్యోగులను నియమించితిని. భటులను

కూడ పెంచితిని. అయిననూ యింకనూ ఏదో కావాలని గొణుగుతూనే ఉండుచుంటివి ఎప్పుడూ! నిన్ను సంతృప్తి పరచ మాకు చేతకావడము లేదు."

" అంతమాట సెలవీయవద్దు యమధర్మరాజా ! తమరు ఒక్కపరి నాబాధను అర్ధము చేసుకొనుడు - కాలం మారింది ప్రభూ - అంతకు మునుపు నేను విధించిన శిక్షలు మౌనంగా భరించేవారు - కాని నేడు ప్రతి ఒక్కడు ఎదురుతిరిగే వాడే - అర్థం కాని మ్లేచ్ఛ భాషలో ఏవో కూతలు కూసేవాడే !"

" అందులకని ..." మొహం చిట్లించారు యమధర్మరాజు.

" తమరు సెలవు మంజూరు చేస్తే నేనుకూడ త్రిలింగదేశమునకు వెళ్ళి వారి భాషలు నేర్చుకుని-వారి చట్టములు - చట్టుబండలు వంట బట్టించుకుని వచ్చెదను-" చేతులు కట్టుకుని చెప్పాడు చిత్రగుప్తుడు.

" చిత్రగుప్తా ! నీవు ఊహించినట్లు లేదు భూలోకం - అందునా ఆంధ్రదేశం - అందులకై నీకు సెలవు యిచ్చుట లేదు-ఇచ్చటనే ఎటులనో కష్టపడి వారిదగ్గరనే నీకు కావలసినవి నేర్చుకొనుమని ఆజ్ఞాపించుచున్నాము!" యమధర్మరాజు ఆరోజుకు సభచాలించి నిష్క్రమించారు...

\- - 0 - -

" మమ్మీ మమ్మీ ఎక్కడున్నావు మమ్మి ! ఈ బోడిగుండుగాడు నన్ను హీటరులో పెట్టి ఫ్రై చేస్తున్నాడు...." ఓ పదహారేళ్ళ పిల్లాడు దీనంగా ఆర్తనాదాలు పెడుతున్నాడు.

పాపులు ఎలా బాధలు అనుభవిస్తున్నారో - భటులు సరిగా తమ విధులు నిర్వహిస్తున్నారో లేదో పర్యవేక్షిద్దామని ఒక రౌండ్సుకు వచ్చిన యమధర్మరాజు చిత్రగుప్తుడి వంక చూసి అడిగారు.

" గుప్తా - ఏమి ఈ కుర్రవాడి కేకలు - వీడు మమ్మి మమ్మి అని కేకలు పెడుతున్నాడు ఏమి? మమ్మీ అనగా నేమి ?" అర్థంగాక అడిగాడు.

" ప్రభూ ! నాకు కూడా సరిగా అర్థము గాకుండా ఉన్నది - ఈ మధ్యన ఇటువంటివి వినివిని చెవులు తూట్లు పడుతున్నవి...." చెవులు మూసుకున్నాడు చిత్రగుప్తుడు.

ఇంతలో యింకో మూలనుండి ఒక పడుచు కేకలు పెడుతున్నది.

" డాడీ డాడీ ! వేరార్‌యూ ! దీస్ ఫెలోస్ ఆర్ కిల్లింగ్‌మీ - వీళ్ళ కంటే అంకుల్ - ఆంటీలు బెటరు - ఒక్కసారే మర్డర్ చేశారు ! హెల్ - హెల్ - హెల్ప్‌మి!" ఏడుస్తూ విచిత్ర భంగిమలు పోవుచున్నది ఆ చిన్నది.

" గుప్తా ! ఏమిటీ గుప్తగోల ! ఒక్క మాట అర్థము కావుట లేదు - "

" ప్రభూ ! అదే నేను తమరికి విన్నవించుకుంటున్నది – వీరు మన శిక్షలకు ఎటువంటి స్పందన చూపుతున్నారో అర్థం కావడం లేదు – అందుకే కాలం మారింది – మనమూ మారాలని మారాము చేస్తున్నది !" చేతులు నులుపుకున్నాడు.

" అసంభవం ! సత్యం మారదు – ధర్మం మారదు – ఈయముండు మారడు ! చిత్రగుప్తుడు మారిన మాడు పగులగొట్టబడును." గర్జించారు.

" అయ్యా తమరి ధర్మనిర్ణయములో తప్పులు దొర్లవు – కాని మేము అమలు చేయుటలో పొరపాట్లు దొర్లిన – " సర్దిచెప్పుకున్నాడు చిత్రగుప్తుడు.

" క్షమించడీ యముండు – " మీసాలు మెలివేశారు యమధర్మరాజులు.

" అందులకే – మన బూజు పట్టిన భావాలను ఈ ముష్కరులు తిరస్కరిస్తున్నారు – మమ్ములను తస్కరులవలె చూస్తున్నారు."

" చిత్రగుప్తా ! అటు చూడు. వాడు చేతిని చెవిదగ్గర పెట్టి వెర్రిమొర్రి వేషాలు వేస్తున్నాడు – వాడి కాలిక్రింద కట్టెలు సరిగా పెట్టించుము – నృత్యం చేయుచున్నాడు – " యమధర్మరాజు ఆదేశించారు.

" ఒరేయ్ భటుడా ! ఏమీ ఈ నిర్లక్ష్యము – వాడి కాలిక్రింద మంటలను బాగా ఎగదోయుము – " చిత్రగుప్తుడు ఎగదోశాడు భటుడ్ని.

" ప్రభూ ! ఎగదోసి ఎగదోసి విసిగితిమి – వాడు అప్పటినుండి చెవి దగ్గర అరచెయ్యి పెట్టుకొని గొణుగుతూనే ఉన్నాడు – వాడీలోకంలో లేదు – మంటలు వాడినేమీ బాధించుట లేదు. " దీనంగా విన్నవించాడు భటుడు.

" ఓహో ! గుప్తా ! తెలిసినది – వాడు అగ్నిమీద యోగా ద్వారా ఆధిపత్యం వహించినట్లున్నాడు – వాడి మీద జలము ప్రయోగించుడు."

" ప్రభూ ! అటు చూడండి ! ఆ మానవుడు విచిత్రముగా అంగన్యాసాలు – కరన్యాసాలు చేయుచూ ఏమో అరచుచున్నాడు. " చిత్రగుప్తుడు సూటు బూటు వేసుకుని మెడలో స్టెతస్కోపు వేసుకుని యమభటుల దెబ్బలకు గంతులు వేయుచున్న ఒక యువకుడు దగ్గరికి తీసుకుపోయాడు యమ ధర్మరాజును.

" ఓయీ భటులారా ! ఏమనుచున్నాడు ఈ తుచ్ఛమానవుడు?" యమధర్మరాజు ప్రశ్నించారు.

" దొరా ! మాకు కూడా అర్థము కావటము లేదు – తమరు ఆలకించండి!" అంటూ ముళ్ళగదతో వాడి వీపు మీద ఒకభటుడు ఒక దెబ్బ వేశాడు. వెంటనే అతగాడు గట్టిగా "ఫోర్" అని కేక వేశాడు. దీంతో కోపం వచ్చి ఇంకోభటుడు ఇంకో గదతో ఇంకో రెండు దెబ్బలు తగిలించాడు.

ఆ యువకుడు ఈసారి ఆనందంగా " సిక్సు" అంటూ అరిచాడు.

" చిత్రగుప్తా ! ఇంతకి ఈ నీచమానవుడు చేసిన నేరము ఏమి?"

" ఏముంది ప్రభూ ! త్రిలింగ దేశంలో ఈ బోడి లింగంగాడు ఒక వైద్యుడు. వీడు శస్త్ర చికిత్స కారుడు. ప్రజలను విపరీతంగా దోచుకున్నాడు. అయిన దానికి కాని దానికి శస్త్ర చికిత్స అని రొక్కము లెస్సగా గుంజినాడు. అంతేగాక వీడికి ఆటలు తిలకించు వ్యసనమున్నది... అలా క్రర బంతి ఆట తిలకించుచు ఒక రోగికి శస్త్ర చికిత్స చేస్తూ " సిక్సు" అని అరచి ఒక నరము బలంగా అనవసరంగా ఉత్తరించాడు - ఆరోగి మరణించినాడు - ఆతరువాత వీడు ఆటలు చూచుటకు పోవుచు ప్రమాదవశాత్తు మరణించాడు-" చిత్రగుప్తుడు వివరించాడు.

" ఔరా ! ఔరౌరా ! క్రరబిళ్ళ కాదు క్రరబంతి ఆడుటయా - ఇతడు చూచుటయా ! క్రరబిళ్ళ మాకు తెలుసు - క్రరబంతి ఆట ఏమి బాగుండును? కొందరు బుద్ధిహీనులు క్రరబంతి ఆట ఆడినంత మాత్రాన ఈ బుర్రలేని వెధవ ఆ బంతి ఆడుట చూడనేల - చూచితివిపో - శస్త్ర చికిత్స సమయమున చూడనేల - చూసితివిపో - నరమునేల కత్తరించవలె ! అవును గుప్తా ! ఆటలమైదానమునందు వారు శస్త్ర చికిత్స చేయుటకు అనుమతి ఎలా యిచ్చిరి?" సందేహం కలిగింది ధర్మరాజుకు.

" ఏలిన వారు ఆగ్రహించకుండా గ్రహించవలసిన దేమంటే త్రిలింగదేశంలో కాలమహిమ ఏమని చెప్పుదుము - ప్రపంచంలోని వింతలు విడ్డూరాలు ఆదేశస్తులు యింటిలోనే కూర్చుని ఓ బుల్లి పెట్టెముందు చూచుచున్నారు!"

" ఆ ! ఏమి విడ్డూరం? దూరదృష్టి అందరికి అబ్బినదా ! ఇది యోగులకు మాత్రమే సాధ్యము కదా ! ఆంధ్రమున అందరూ యోగులేనా?"


" అది ఏమోగాని ప్రభూ అందరూ రోగులుగా-భోగులుగా మారుచున్నారు. బుల్లిపెట్టె చమత్కారముతో ఆర్షధర్మాలను - వేదసంస్కృతిని తిరస్కరిస్తున్నారు-" వగచాడు చిత్రగుప్తుడు.

" అటులనా - అయితే త్రిలింగ దేశవాసులకు ప్రత్యేక శిక్షలు విధించ వలసిందిగా మన చట్టములను సవరించెదము - ఇతగాడేమీ ఇంకను చేతులతో కాళ్ళతో విచిత్ర విన్యాసాలు చేస్తూనే ఉన్నాడు చలిజ్వరపీడితుడిలాగా - వీడ్ని నిప్పుతో బాగుగా కాల్చుము." ఒక వ్యక్తిని సమీపించి చెప్పారు.

" అయ్యా ! వీడిది చలి జ్వరం కాదయ్యా - మ్లేచ్ఛ సంస్కృతిని అనుసరించి నృత్యం చేయుచున్నాడని భావించుకుంటున్నాడు." ఒక భటుడు విన్నవించాడు.


రేపటి నుంచీ పాలధర
పెంచుతున్నా మేడమ్!
నీళ్ళకూడా కొంటున్నా!
AVM


చీర చాలా బావుందండీ! మీరు జాగ్రత్తగా
వుతుకుతానూ.. అంటే! కొంటా!!
ఏవిఎమ్.


అబ్బబ్బ...
పనిలో వున్నారా!
మాట్లాడుతూ
పని చేసుకోరా!
ఏవిఎమ్.

" వీడు మన అప్సరసల నృత్యగానాలను తిలకించినట్టులేదు- లేనిచో ఈవంకరలు పోడు- ఈ వికార భంగిమలు ఒనర్పడు - వీడిని గోడకు వేలాడదీసి ఇనుప సంకెళ్ళతో కాళ్ళు చేతులు కట్టి వేసి మొహంమీద కుమ్మపొగ గొట్టుడు." చిత్రగుప్తుడు కొత్త ఆజ్ఞ జారీ చేశాడు.

అలా పోతుండగా యమధర్మరాజు ఓ ముసలాయన దగ్గర నిలబడి పోయారు. అతని వేషం విచిత్రంగా కనిపించింది. ఖద్దరుచొక్కా టోపీ - చేతిలో గరిటె, ఒక చెయ్యి పైకెత్తి ఇంకో చేతితో గరిటెను నోటిదగ్గర పెట్టుకుని అరుస్తున్నాడు. - అతగాడు వీరిని చూశాడు.

" మహాశయులారా ! మీ ఓటు నాకేవేసి గెలిపించ ప్రార్థన ! మధ్యంతర ఎన్నికలు వస్తున్నాయి. నేను యమ్మెల్యేగా పోటీ చేస్తున్నాను - నేను మంత్రి కాగానే మీకు ఇళ్ళు కట్టించి యిస్తాను - దున్నుకోడానికి పొలం యిస్తాను. మీ పిల్లలకు ఉచిత సీటు యిప్పిస్తాను చదుకోవడానికి - అంతేగాదు మీకు గుండెజబ్బు చేస్తే ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తాను - కిలో బియ్యం రూపాయికే యిస్తాను - ఉచితంగా కరెంటు యిస్తాను - మీ యిళ్ళకు నీళ్ళు యిప్పిస్తాను." అంటూ ఏదేదో చెప్పుకు పోతున్నాడు.

" చిత్రగుప్తా ! ఈ పిచ్చివాడెవరు?"

" పూర్వాశ్రమంలో వీడో మంత్రి అండి - త్రిలింగ దేశంలో ఒక వెలుగు వెలిగాడు. ప్రజలను బురిడీ కొట్టించడంలో మహాదిట్ట. పదవిలేనిది పదిరోజులు కూడ ప్రశాంతంగా ఉండలేడు. చెప్పిన అబద్ధం చెప్పకుండా వాగ్దానాలు చేయడంలో దానకర్ణుడిని మించి పోయాడు. జలగలాగా ప్రజలనెత్తురు తాగాడు. వాళ్ళ మాన ప్రాణాలతో ఆడుకున్నాడు. చివరికి విద్రోహుల చేతుల్లో మరణించాడు - అయినా ఇంకా ఎన్నికలు దగ్గరలో ఉన్నాయని కలలు కంటున్నాడు." చెప్పాడు చిత్రగుప్తుడు ధర్మరాజుతో - ఈ మాటలు అతగాడు విన్నాడు.

" చిత్రగుప్తా ! వచ్చే ఎన్నికల్లో యమధర్మరాజును ఓడించి - అతగాడ్ని క్రిందకు దింపి - ఆపదవి నేనే చేజిక్కించుకుంటానని ఘంటాపథంగా చెబుతున్నాను- ఇప్పుడు నన్ను సరిగా చూసుకోకపోతే నేను అధికారంలోకి రాగానే నిన్ను ఊడబెరికి యింటికి పంపిస్తాను - జాగ్రత్త!" అంటూ హెచ్చరించాడు ఆ వినాయకుడు.

యమధర్మరాజు మొహంలో రంగులు మారిపోయాయి.

" చిత్రగుప్తా ! ఏమా ప్రేలాపన ! వీడ్ని పిండి పిండిగా కొట్టుడు - "

" అన్యాయం ! ప్రతిపక్షాన్ని - దాని నాయకుడిని గౌరవించాలి ! హింసించకూడదు

- ప్రజలు ఊరుకోరు - నీ పదవి పోగానే నిన్ను శిక్షిస్తారు."

" భటులారా ! వీడి నాలుక పీకి వేయుడు !" చిత్రగుప్తుడు చెప్పాడు.

" అన్యాయం ! భారత రాజ్యాంగం నాకు వాక్ స్వాతంత్ర్యం యిచ్చింది - అన్యాయం నేను మీమీద కోర్టులో కేసు వేస్తాను - " అరిచాడు నాయకుడు.

" చిత్రగుప్తా ! ఈ రోజుకు మన పర్యవేక్షణ ఆపి - విశ్రాంతి తీసుకొందాము. నా మనసు బాగోలేదు - ఆ నాయకుడి పాపానికి నాయకుడ్ని పోనీమ్ము - అదనపు శిక్షలు వద్దులే - " అంటూ భటుల్ని వారించారు యమధర్మరాజు.

యమధర్మరాజు - చిత్రగుప్తుడు తమ సభ మంటపానికి విచ్చేశారు - ధర్మరాజు మనసు గందరగోళంగా ఉంది.

" చిత్రగుప్తా ! ఏమిటి ఈ గొడవ ! ఈ శిక్షలేమిటి ! ఈ అరుపులేమిటి ! జీవులను ఇలా హింసించ పని మనకేల?" ఆవేదనగా అన్నాడు.

" ప్రభూ ! అది మీ ధర్మం - మీ కర్తవ్యపాలన !"

" ఛీ ఛీ ! నా వృత్తి అన్నచో నాకే రోత కలుగుచున్నది రోజురోజుకు. ఆ దేవేంద్రుడు ఎంత హాయిగా ఉన్నాడు - అప్సరసల నాట్యవినోదాలు - సురాపానాలు - మహర్షుల దీవెనలు ! ఎంత స్వేచ్ఛగా ఎక్కడికైనా పోగలడు. నాకు విహారానికి వెళదామన్న తీరికలేదు. ఇరువది నాలుగు గంటలు నా వృత్తిధర్మము నాకు స్వేచ్ఛ పోగొట్టుచున్నది..." బాధపడ్డారు.

" మహారాజా ! అలా అనుకుంటే ఎలా ! మీకున్న విస్తృత అధికారాలు దేవేంద్రుడికి ఎక్కడున్నాయి ప్రభూ ! పుట్టిన ప్రతి జీవి మీ చేతిలోనే మరణిస్తాడు. వాడి పాపపుణ్యాలను చూసి ఏలోకంకు పంపవలసింది నిర్ణయిస్తారు - లక్షల్లో ఒకడు మాత్రమే స్వర్గానికి పోతున్నాడు - మిగతా జీవులమీద అధికారం మీకే కదా ! మీ ఆజ్ఞ లేంది ఎవడి ప్రాణం పోవడానికి అధికారం లేదు - ఆరకంగా సురేంద్రులకన్నా నరకేంద్రులే గొప్పవారు! " చిత్రగుప్తుడు ఓదార్చాడు యమధర్మరాజును.

" అంతేనంటావా గుప్తా ! ఆ జీవుల బాధలు - రోదనలు నాకు ఏమియు అర్థము కావుటలేదు. వినడానికి తెలుగులాగున్నా అర్థం కావడం లేదు - "

" ప్రభూ తుచ్ఛులు మ్లేచ్ఛ భాష వాడుతున్నారు. "

" ఏ భాష అది?"

" ఆంగ్లము అందురు ! అందరూ దాని వెంట పడిరి - ఆంధ్రులు ఆరంభశూరులు, అనుకరణసిద్ధహస్తులు కాబట్టి ఆంగ్లమును గట్టిగా వాటేసుకున్నారు"

" అరెరే ! ఎంతటి చిత్రం ! వారి మాతృ భాషను వదిలివేసి పరాయి భాష వెంట

పడిరా?" వాపోయాడు ధర్మరాజు యమంగా.

" కొత్తకవింత - పాతొకరోత - వేలం వెర్రి ప్రభూ !"

" అటులనా ! తెలుగు తల్లికి ఇంతటి దీనవస్థా !"

" అవును ప్రభూ ! ఈ మధ్య ఇక్కడికొక చాధస్తుడు వచ్చినాడు - పేరు కోదండంట- అతగాడు నాకు కొంచెం మిత్రుడయినాడు - వాడిని పిలువ పంపుదును - వాడితో మాట్లాడి మీ సందేహములు - నా అనుమానములు తీర్చుకొందుము."

చిత్రగుప్తుడు - భటులను పంపి కోదండంను పిలిపించాడు క్షణాల్లో.

" యమధర్మరాజుల వారికి ఈ కోదండం దండం పెడుతున్నాడు".

" లెస్స ! లెస్స ! ఉచితాసనం స్వీకరింపుడు - "

" ధన్యోస్మి ! తమరు కూడ నా భాషను లెస్స అంటున్నారా ! కృతజ్ఞతలు ". కూర్చున్నాడు కోదండం వినయంగా నమస్కరించి.

చిత్రగుప్తుడు అతని వంక చూసి చెప్పాడు " ప్రభువుకు ధర్మసందేహము కలిగినది - తెలుగు భాషకు దుర్గతి పట్టిందాని !? తీర్చుడు."

" ఏలిన వారికి ఏమని విన్నవించను. సిగ్గు సిగ్గు ? పుట్టిన ప్రతివెధవా అమ్మ అని ఏడవకుండా "మమ్మీ మమ్మీ " అని ఏడుస్తున్నాడు - నాన్నా అని కూయకుండా " డాడీ డాడీ" అంటూ వగలు పోతున్నాడు. బొడ్డూడని వెధవ దగ్గరనుండి ' అత్తా ' ' మామ ' అని పిలవకుండా ' ఆంటీ - అంకుల్ ' అంటూ గంతులేస్తున్నారు." కోదండం చెప్పాడు బాధపడ్తూ.


" ఆంటీనా - ఏంటీ ?"

" ఆంటీ అంటే అత్త కావచ్చు - పిన్నమ్మ కావచ్చు ఇంకేమన్నా కావచ్చు. అమ్మ కాని వాళ్ళు అందరూ అంటీలే - అలాగే తండ్రి కాని వెధవలంతా అంకుళ్ళే! అంకుల్ అంకుల్ అంటూ ఉంటే నాకు మర్డర్ చేద్దామన్నంత కోపంగా ఉంటుంది." కోదండం ఊగిపోయాడు.

" కోదండా ! ఏమి ఆవేశం - నీవు కూడా మ్లేచ్ఛ పదమును ఉపయోగించుటయా!" చిత్రగుప్తుడు మందలించాడు ముక్కుమీద వేలేసుకుని.

" క్షమించండి - తెలుగులో హత్య అనడం కన్నా 'మర్డర్' అంటే పవర్‌ఫుల్‌గా - ఎమోషనల్‌గా ఉంటుందని అన్నాను - ఏం చెయ్యమంటారు - నా జీవిత కాలమంతా తెలుగు భాషా ఉద్యమంలో గడిచిపోయింది. తెలుగు ప్రజలను - తెలుగు భాషను ఉద్ధరిద్దామని కంకణం కట్టుకున్నాను. కాని ఒక్క ' దాంకీ ' కూడా నామాట వినడే !"


ఇంకో రెండు నెలలు
వుండమని
బతిమాలుతోంది
మన కోడలు!!
రాజధానిలో
నీటి
ఎద్దడి
ఏవిఎమ్


ఈవారం అంతా మన మేనేజర్‌కి 'వాటర్'
సప్లయ్ చేశా! ప్రమోషన్ కొట్టేశా!!
B.P. రావు
మేనేజర్
ఏవిఎమ్


ఇప్పుడు మీరు అరచేతి దురదలకు
రాసిన మందు ఎలాకడగాలో రేపు
ఇదే ప్రోగ్రామ్‌లో చెబుతాం!!
ఏవిఎమ్.

కోదండం వాపోయాడు.

" మళ్ళీ మళ్ళీ పరాయి మాట !" చిత్రగుప్తుడు అభ్యంతరం

" గాడిద అన్నపదం కన్నా నీచంగా ఉంటుందని ' డాంకీ ' వాడాను క్షమించాలి !" విన్నవించుకున్నాడు కోదండం.

" కోదండా ! తెలుగుతల్లికి ఏల ఈ తిప్పలు? తేనెలూరు తెలుగు భాషను నోరారా పలుకకుండా వచ్చీరాని ఎంగిలి పీచు ప్రేలుట ఏల? తల్లిదండ్రులు ఏంచేస్తున్నారు? పిల్లలు క్రమశిక్షణ తప్పితే వారిని దారిలోకి పెట్టి - మాతృభాషలో శిక్షణ యివ్వాలి గదా ?" యమధర్మరాజు ఆవేదనతో అడిగారు.

" అస్సలు చిక్కు అంతా అక్కడే ఉంది దొరా ! పిల్లల్ని చెడగొడుతున్నదే తల్లిదండ్రులు!" కోదండం చెప్పాడు.

"ఔరా ! తల్లిదండ్రులు పిల్లలను చెడగొట్టుటయా ! చిత్రగుప్తా ! ఏమది ? వారికి ఎటువంటి శిక్ష విధించవలె !" కోపంగా అడిగారు.

" అవును ప్రభూ ! పిల్లలు అమ్మా అంటే మూతిమీద కొడుతుంది అమ్మ?" చెప్పాడు కోదండం.

" ఎందుకని ?"

" మమ్మీ అనమని. ఆమెకు తనను 'అమ్మా ' అని పిలిపించుకోవడం యిష్టం ఉండదు - 'మమ్మీ' అని పిలిపించుకోవాలి ! కాని ప్రభూ! ఆంగ్లమున మమ్మీ అంటే ప్రాణం లేని శవము అని అర్థం-అయినా కూడ అటులనే పిలిపించు కొనుచున్నారు." కోదండం చెప్పాడు.

" ఓహో ! మనసంస్కృతిని చంపిన తరువాత తాము మృతప్రాయులమని 'మమ్మీ' అని పిలిపించుకుంటున్నారన్నమాట !" యమధర్మరాజు.

" కనీసం తండ్రులయినా సరియైన బుద్ధిగరపాల్సింది !" చిత్రగుప్తుడు విచారించాడు.

" లేదు దొరా ! వారు తక్కువ తినలేదు. తమలను డాడీ అని పిలిపించుకుంటారు - నాన్న అంటే నడ్డిమీద తంతారు - " కోదండం చెప్పాడు.

" ఔరా కాలమహిమ ! నాన్న లోని ఆప్యాయత డాడీలో ఉందా? అమ్మలోని మాధుర్యం మమ్మీలో ఉందా-ఇందాక నువ్వేదో గాడిదను డాంకీ అని అన్నట్లున్నావు-డాడీ అని పిలిస్తే నాకు అది గుర్తుకొస్తున్నది-ఛీ! తెలుగు యింత దిగజారిపోయిందా?" ధర్మరాజులు విచారించారు.

" అయిందా ప్రభూ ! పిల్లల్ని ఆంగ్ల చదువులకు ఎంత డబ్బు కట్టి అయినా చేర్పిస్తున్నారు

– పై చదువులూ అంతే ప్రభూ ! ఎందుకంటే ఆంగ్లమున చదివిన ఉద్యోగవకాశములు మిన్న అన్న భావన బలంగా ఉంది వారిలో. అలాగే–తెలుగు చదివిన వారికి గుర్తింపులేదు – విలువ లేదు–ఉద్యోగం అంతకంటే లేదు–అస్సలు తెలుగు భాషకు – చరిత్రకు – సంస్కృతికి గడ్డిపోచ విలువ లేదు తెలుగు దేశంలో!" కోదండం గుండె పట్టుకున్నాడు బాధతో.

" మహారాజా ! అటువంటి పరిస్థితుల్లో ఈ కోదండం మాతృభాష ఉద్ధరణకు నడుం బిగించాడు. ఇంటింటికి పోయి ప్రచారం చేశాడు – ఇతగాడ్ని ప్రజలు పిచ్చివాడిలా చూశారు!" చిత్రగుప్తుడు.

" అయ్యో బాబూ ! పరిస్థితి ఇలాగే కొనసాగితే మనపంచదారలాంటి మధురమైన తెలుగు మాతృభాష కొన్ని సంవత్సరాలలోనే మృతభాషగా మారుతుందని నెత్తినోరు కొట్టుకుని చెప్పాను. " కోదండం విన్నవించుకున్నాడు.

" భేష్ ? బాగా చెప్పావు! ఉండవలసిన వాడివి!" మెచ్చుకున్నారు ప్రభు.

" కాని ఏమి ప్రయోజనం ప్రభూ నా మాట ఎవరూ వినలేదు – "

" ఆఖరికి ఇతగాడి కొడుకుకోడలు కూడ వినలేదు–ఇతడిమనవడు– మానవ రాళ్ళను ఆంగ్లమున అభ్యసింపచేసి మ్లేచ్ఛదేశానికి సాగనంపారు." చిత్రగుప్తుడు చెప్పాడు.

" అహో ! ఆంధ్రలో వలస పోవుచున్నారా? అది ఏల? "

" ప్రభూ ! పొట్ట చేత్తో బట్టుకుని కన్న తల్లిని, కన్న భూమిని అన్నిటిని వదలి విదేశాలకు వెళ్ళి అక్కడ స్థిరపడిపోయి – అక్కడి ప్రజలతో మమేకమయి పోతున్నారు." కోదండం చెప్పాడు ఇంకా బాధపడుతూ ఇలా –

" వాళ్ళు గుడ్డిలో మెల్ల కొంత ! ఇక్కడే ఉండి – ఈ నేలమీద బతుకుతూ – ఈ గాలి పీలుస్తూ, అహరహం తెలుగు తల్లి ఒడిలో ఉంటూ, నిత్యం ఆంగ్ల భాషను – పరాయి భాషలను స్మరించుకుంటూ – వారి వేషభాషలను అనుకరిస్తూ – వారి సంస్కృతిలో మునకలేస్తూ ఎక్కువ మంది దుష్టులు ఆంధ్రదేశంలో అగుపిస్తున్నారు – మన నైతికవిలువలు – మన సాంప్రదాయాలు వాళ్ళ చేతిలో బలి అయిపోయాయి."

" ఔరా ! కలికాలమహిమ ! అంతవైభవంగా వెలసిన తెలుగుభాష – తెలుగుసంస్కృతి రానున్నకాలంలో కానరాదా! అదేనా మనలోకంలోకూడా వ్యాపిస్తున్నది – ఇంతకీ చిత్రగుప్తా ! ఇంతగొప్ప మాతృభాష సేవ చేసిన ఈ కోదండం మన ఆతిధ్యంలో ఎందుకున్నాడు?" యమధర్మరాజుకు అనుమానం వచ్చింది.

" ప్రభూ! ఇతగాడు తెలుగుతల్లి విగ్రహం స్థాపిస్తానని–వేలకు వేలు చందాలు వసూలు చేసి స్వంతానికి వాడుకున్నాడు–తెలుగు తల్లిని ప్రతిష్టించలేదు కాని–అద్భుతమైన భవంతి

నిర్మించుకున్నాడు ప్రజలడబ్బుతో- ఆయింటికి తెలుగు సీమ అని నామకరణం చేశాడు కూడ." చిత్రగుప్తుడు వివరించాడు.

"ప్రభువులు మన్నించాలి! ముందు ఇంటగెల్చి రచ్చగెలవమన్నారు. తెలుగుతల్లిని స్థాపించే ముందు నాఇల్లు చక్కటి తెలుగు సీమగా మారుద్దామనుకున్నాను-తొలుత మన సంస్కృతి సాంప్రదాయాలను నా గృహసీమలో స్థాపించి-ఆ పిదప తెలుగు తల్లిని అక్కడక్కడ వెలయింప చేద్దామనుకున్నాను-కాని ప్రజలు పొరపడ్డారు-అనుమానపడి నన్ను హింసించి చంపివేశారు- దాంతో నా తెలుగు భాషా సేవకు విఘ్నం ఏర్పడింది." చెప్పుకున్నాడు కోదండం.

"చిత్రగుప్తా ! ఇతనికి ఇంకో అవకాశం యివ్వు - ఈసారి ఏం చేస్తాడో చూద్దాం -" అంటూ సభచాలించారు యమధర్మరాజు.

"ప్రభూ ! మరి నాసంగతి ?" చిత్రగుప్తుడు వెంటపడ్డాడు.

"కాలం నిర్ణయిస్తుంది !" గంభీరంగా నవ్వారు యమధర్మరాజు.

"అమ్మమ్మ - ఎంతమాట !" చిత్రగుప్తుడు అన్నాడు.

"తెలుగుప్రజలు ప్రలోభాలకు లొంగిపోయి మాతృభాషను తమ సంస్కృతిని విస్మరిస్తున్నారు. ధనంలోనే సుఖం-పరం ఉన్నాయని భ్రమిస్తున్నారు. తెలుగుకు పట్టిన తెగులు ఎప్పుడు తెగుతుందో? అప్పటిదాకా ఆంగ్ల చిత్రగుప్తుని వెతికి తెచ్చుకొనవలసి వచ్చునట్లున్నది." సాలోచనగా అన్నారు.

"ప్రభూ ! అంతమాట అనవద్దు - నేను, నా తిప్పలు నేను పడి ఆంగ్లమును నేర్చుకొందును - ఇంకొకరిని నియమించవద్దు."

"ఔరా ! పదవీ ప్రలోభంలో పడిపోయి నీవు కూడ మ్లేచ్ఛ భాష నేర్చుకొందువా - హతవిధి - చిన్న పరీక్ష పెడితే ఓడిపోతివి చిత్రగుప్తా !" యమధర్మరాజు గంభీరంగా అన్నారు.


"క్షమించాలి ప్రభూ ! ఈ నీచ మానవులతో చేరి నా మనసుకూడ చలించుచున్నది - తమరి దయ నా ప్రాప్తం !" చిత్రగుప్తుడు వినయంగా అన్నాడు.

"లెస్స ! నీకు కొంతకాలం విశ్రాంతి అవసరము - ఒక దివ్య సంవత్సరము సెలవు మంజూరు చేయుచున్నాను - పొమ్ము !" దీవించారు యమధర్మరాజు.


"చిత్తం ! చిత్తం ! " నమస్కరించాడు చిత్రగుప్తుడు.

- తెలుగు కథకు నూరేళ్ళ సందర్భంగా శ్రీ వేదగిరి రాంబాబు గారు వెలువరించిన కథల సంకలనం 'అద్దం'లో ప్రచురితం


డియర్!...,
నీ పుట్టినరోజు ఎలా మర్చిపోతాను!
పక్కింటి రోజాదీ ఈ రోజేగా!!
ఏవిఎమ్


నే నడిగినవన్నీ
కొనిపెట్టు లేకపోతే
చెప్పురాజూ!
అవతల
రెడీగా వున్నారు!
ఏవిఎమ్.


అన్ని టెస్టులూ చేసానోయ్ గుర్నాథం..
నీ లాంటి లీడరుకి కొత్తగా వచ్చిన
మంత్రిపదవి పోయేదాకా.
నీకు వచ్చిన కడుపు
నొప్పి తగ్గదు...!
ఎవిఎమ్


వైజాగ్ వెళ్ళవలసిన రైలు
తప్పిపోయి, కన్యాకుమారి
చేరింది!!
ఏవిఎమ్.


పగలంతా నగలు ఇట్లా
దిగేసుకుండేవిటే అనుకోకండి,
ఎప్పుడు 'సిబిఐ' వాళ్ళు
వస్తారో ఏమో!!!
మంత్రి
ఏవిఎమ్.


నిజంగా నా ఆస్తి కోటి
రూపాయలే! మిగతా
నాల్గువేల కోట్ల ఆస్తి
ప్రజలంతా
ఇచ్చారు! దసరా
మామూలు కింద!
సిబిఐ
ఏవిఎమ్.